

హనుమంత వాహనంపైవిహరిస్తున్న కోదండరాముడు

కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయండి

- పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి
- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి




మాట్లాడుతున్న కలెక్టర్

కడప కలెక్టరేట్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దీక్షతో విధులు నిర్వర్తించి సీతారాముల కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి కోదండరామస్వామి కల్యాణోత్సవ విధుల నిర్వహణపై సంబంధిత లైజాన్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ తేదీ శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపన ముఖ్యమంత్రి సీతారాముల వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 121 గ్యాలరీలలో 60 వేల మంది సౌకర్యవంతంగా కూర్చొని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాల పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ, ప్రసాదం, కంకణం, అన్న ప్రసాదాలు అందించేలా ఏర్పాట్లు చేపట్టామన్నారు. నడిచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 11 ప్రాంతాల్లో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ సీతారాముల కల్యాణాన్ని వీక్షించేలా 21 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా చిన్న పొరపాట్లకు కూడా ఆస్కారం లేకుండా అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, జడ్పీ సీఈవో ఓబులమ్మ, కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొరకునా ఇటువంటి సేవ...

- హనుమంత వాహనంపై శ్రీరాముడు విహారం
- నవనీత కృష్ణాలంకారంలో రాముడి చిద్విలాసం
- వైభవంగా కోదండరాముడి బ్రహ్మోత్సవాలు







బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్త జనం



హారతి తీసుకుంటున్న భక్తులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం శ్రీరాముడు హనుమంత వాహనంపై విహరించారు. బుధవారం ఆలయ అర్చకులు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సీతారామ లక్ష్మణులు హనుమంత వాహనంపై ఊరేగారు. దారి పొడవునా భక్తులు కోలాటాలు నిర్వహించారు. ఉదయం శ్రీరామచంద్రుడు నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కృష్ణుడు వెన్న దొంగ రేపల్లెలో బాలకృష్ణుడు వెళ్లి వెన్న ఆరగించేవారు. చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేసుకుంటూ రాములవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 11 గంటలకు కంకణభట్టర్ రాజేశ్వర్‌కుమార్ స్వామి వారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, అధికారులు హనుమంతయ్య, నవీన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవనీతకృష్ణాలంకారంలో రామయ్య విహారం

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అదనపు ఈవో



కల్యాణవేదికను పరిశీలిస్తున్న అదనపు ఈవో

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. బుధవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఆయన కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంతి చంద్రబాబునాయుడు కల్యాణానికి వస్తున్నారని, ముఖ్యమంత్రి బస చేసే గదుల్లో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాల్లో పచ్చదనం, పుష్పాలంకరణలు తాజా పుష్పాలతో ఏర్పాటు చేయాలన్నారు. పుష్పాలంకరణలో రాజీ పడకుండా నాణ్యతతో కూడిన పనులు చేయాలన్నారు. జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండువేల మందితో భద్రతా ఏర్పాట్లు

- ఎస్పీ అశోక్‌కుమార్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణం సందర్భంగా రెండువేలమందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. బందోబస్తు విధుల్లో నలుగురు అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 73 మంది సీఐలు, 177 మంది ఎస్ఐలు, 1700 మంది పోలీసు సిబ్బంది ఉంటారని ఎస్పీ తెలిపారు. బుధవారం కడప నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో బందోబస్తు విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులకు, సిబ్బందికి, ఏఆర్ సిబ్బందికి బందోబస్తు ప్రణాళికపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. సీతారాముల కల్యాణానికి పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాంబు డిస్పోజబుల్ టీం, స్పెషల్ పార్టీ సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటరు ద్వారా భద్రత పర్యవేక్షించేలా పోలీసు అధికారులకు, దిశ నిర్దేశం చేశారు. అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టరు దారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, శివరాముడు పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు 145 ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో జరగనున్న కోదండ రామస్వామి కల్యాణోత్సవం సందర్భంగా 11వతేదీ శుక్రవారం 145 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 35, పులివెందుల 12, బద్వేలు 22, జమ్మలమడుగు 12, మైదుకూరు 7, ప్రొద్దుటూరు 17తో పాటు ఇతర డిపోలు (రాయచోటి, రాజంపేట) నుంచి మరో 40 బస్సులు ఒంటిమిట్టలో కల్యాణోత్సవం జరిగే ప్రాంతం వరకు చేరుకుంటాయన్నారు. వీటితో పాటు ఒంటిమిట్ట కడప వైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం నుంచి కల్యాణం జరిగే ప్రాంతం వరకు పది ఉచిత బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఇవే కాకుండా తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో ఉచిత బస్సులు నడుస్తాయన్నారు. పక్క జిల్లాలైన అనంతపురం, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, విజయవాడ, విశాఖ పట్టణం, హైదరాబాదు నుంచి కూడా సీతారాముల కల్యాణానికి హాజరేయ్యే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రొద్దుటూరులో బెట్టింగ్ ముఠా..!

- 23 మంది అరెస్టు
- రూ. 3.10 లక్షల నగదు,23 సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 23 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.10 లక్షల నగదు, 23 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయ ఆవరణలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహణలో అరెస్టు అయిన వారిని విలేకరుల ముందు హాజరుపరచారు. డీఎస్పీ భావన మాట్లాడుతూ 8వతేది రామేశ్వరంలో నీళ్లట్యాంక్ వద్ద క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి అందుకు సంబంధించిన లావాదేవీలు జరుపుతున్న 18 మందిని ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి ఎస్ఐ శ్రీనివాసులు అరెస్టు చేశారన్నారు. నిందితుల నుంచి రూ.2.05 లక్షల నగదు, 18 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో పుత్తా గిరీష్ అనే వ్యక్తి గతంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి నష్టపోయాన్నారు. అతని గురించి తెలుసుకున్న బిగ్‌బుల్ 247.కామ్ అనే వెబ్ సైట్ వారు అతనికి కమీషన్లు ఇస్తామని ఆశ చూపడంతో అతనికి తెలిసిన వారందరిని ఆన్‌లైన్ గేమింగ్‌యాప్ వైబ్‌సైట్‌లో సభ్యులుగా చేర్పించి బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడన్నారు.



క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 23 మందిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ భావన, సీఐలు

ఈ గేమింగ్ యాప్‌లపై పోలీసులు నిఘా పెట్టడంతో గిరీష్‌ను కనిబెట్టామన్నారు. అతని ద్వారా మరో 40 మందిని గుర్తించామన్నారు. వారిలో మంగళవారం గిరీశ్‌తో కలిపి 18 మంది అరెస్టు అయ్యారన్నారు. బుధవారం ప్రొద్దుటూరు టౌన్ కోనేటి కాల్వ వీధికి చెందిన షేక్ మాబుషరీప్ అలియాస్ చుంచు, ఓబులవారిపల్లెకు చెందిన పించాల జనార్ధన్ రెడ్డి, హోమస్‌పేటకు చెందిన భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, నడింపల్లె రెడ్డివారివీధికి చెందిన వేంపల్లి సుదర్శన్‌రెడ్డి, వెదుర్లబజార్‌కు చెందిన శ్రీరామ సుబ్బరాయుడు అనే వారు ఇస్లాం పురం దర్గా వద్ద క్రికెట్‌బెట్టింగ్ నిర్వహించి డబ్బు పంపకాలు చేస్తుండగా సీఐ రామకృష్ణారెడ్డి అరెస్టు చేశారన్నారు. వీరివద్ద నుంచి రూ.1.05 లక్షల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన బడా క్రికెట్ బుకీలు ఏలే నరసింహ, అరవ మునివర, షేక్ ఫారూక్, షేక్ గౌస్‌బాషా అలియాస్ బెంగళూరుబాషా, షేక్ ఖాదర్ బాషాల కనుసన్నుల్లో వీరంతా ప్రస్తుత ఐపీఎల్ సీజన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. బడా బుకీలందరిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

పాడాపై విజిలెన్స్

- జగన్ హయాంలో.. పాడా పేరిట నిధుల వరద
- పులివెందులలో రూ.1200 కోట్లతో 254 పనులు
- పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు
- మరికొన్ని నాశిరకం
- ప్రభుత్వానికి ఫిర్యాదు
- విచారణకు ఐదుగురితో కమిటీ ఏర్పాటు



పులివెందులలో క్రికెట్ స్టేడియం

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి (పాడా) పేరిట వందల కోట్లు కుమ్మరించారు. జిల్లా హెడ్‌క్వార్టర్ అయిన కడపను కూడా పట్టించుకోకుండా సొంత గడ్డకే రూ.కోట్లు పెట్టారు. ఆ సొమ్ముతో పులివెందుల రూపురేఖలు మారిపోయిందేమీ లేదు. సాక్షాత్తు పులివెందుల పట్టణంలోనే జనానికి 24గంటలు తాగునీరు అందించకుండానే జగన్ దిగిపోయారు. అయితే పాడా పేరిట ప్రజల సొమ్మును ఆపార్టీ నేతలకు ఫలహారంగా పంచారనే ఆరోపణలున్నాయి. వైసీపీ హయాంలో అడిగే దమ్ము ధైర్యం ఎవరికీ లేదు. అధికారులు కూడా జీ హుజూర్ అంటూ పనిచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో.. జగన్ హయాంలో పులివెందులలో కుమ్మరించిన వందల కోట్లపై దృష్టి సారించారు. పాడా పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారని కొన్ని పనులు నాశిరకంగా ఉంటే మరికొన్ని పనులు చేయకుండానే బిల్లులు చేశారంటూ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం జగన్ కోటలో పాడా నిధులతో జరిగిన అక్రమాలను గుట్టురట్టు చేసేందుకు తిరుపతికి చెందిన ఎస్.యోగేశ్‌బాబు, ఎం.రామ్మోహన్, ఎన్.రామాంజనేయరెడ్డి, కర్నూలుకు చెందిన ఎం.ఆనంద్‌బాబు, సిద్దయ్యలతో కూడిన అధికార బృందాన్ని నియమించింది. వీరు నేడో రేపో విచారణ చేపట్టి జగన్ కోటలో పాడా పేరిట జరిగిన గోల్‌మాల్‌ను వెలుగులోకి తేనున్నారు.



పులివెందుల రింగ్‌రోడ్డులో దెబ్బతిన్న సెంట్రల్ లైటింగ్

పులివెందులలో రూ.1200 కోట్లు

జగన్ హయాంలో పులివెందులలో రూ.1,200 కోట్లతో 254 పనులు చేపట్టారు. ఇందులో పులివెందుల మున్సిపాలిటీలోనే 53 పనులు చేశారు. రింగురోడ్డు సుందరీకరణ సెంట్రల్ లైటింగ్, మినీ సెక్రటేరియట్, లేక్‌వ్యూ, ఆర్టీసీ బస్టాండు, బోలే వార్డు, క్రికెట్ స్టేడియం, సిమెంటు రోడ్లు ఇతర పనులు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండు సుమారు రూ.35 కోట్లతో, బోలే వార్డు రూ.7కోట్లతో ఇతరత్రా పనులు చేపట్టారు. ఇక వేంపల్లెలో రూ.35 కోట్లతో రహదారుల విస్తరణ, ఇతర అబివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గవ్యాప్తంగా సీసీ రోడ్లు, తారురోడ్లు, విద్యుత్‌లైన్లు, డ్రింకింగ్ వాటర్ ఇతరత్రా పనులు చేపట్టినట్లు రికార్డుల్లో ఉన్నాయి. అయితే ఏ పనులు ఎన్ని కోట్లతో చేస్తున్నారు, పూర్తి బిల్లులు ఎంత చెల్లించారు, పనుల ఆమోదం, ఇలాంటి సమాచారం ఏదీ బయటికి పొక్కనీయకుండా చేశారు. జగన్ సీఎం హోదాలో ప్రారంభించిన పనులు సైతం కొన్ని కొద్దిరోజులకే దెబ్బతిన్నాయి. చాలా వరకు పనులు చేయకుండానే చేసినట్లు నిధులు భారీగా బొక్కేశారని విమర్శలున్నాయి. వందల కోట్లు ఖర్చు పెట్టినా అక్కడ ఇంకా మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూరలేదు.

గుట్టు వీడనున్న జగన్‌కోట రహస్యం

జనం సొమ్మును పాడా పేరిట ఫలహారంగా వైసీపీ కార్యకర్తలకు పంచారనే ఆరోపణలున్నాయి. పాతబస్టాండు నుంచి వెంకటేశ్వరస్వామి టెంపుల్ మీదుగా పూలంగళ్లకు వెళ్లే ప్రధాన రహదారిని కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి బోలే వార్డుగా మార్చారు. హడావుడిగా పనులు చేయడంతో వర్షం వచ్చినప్పుడు నీరు పోయే దారిలేక ఇదంతా చెరువును తలపించే విధంగా ఉండేది. ఇక పులివెందుల ఆర్టీసీ బస్టాండు నిర్మాణంపై సోషల్ మీడియాలో ట్రోలింగ్, వచ్చిన సెటైర్స్ అన్నీ ఇన్నీ కావు. పులివెందులలో బస్టాండు కట్టలేని వాడు మూడు రాజధానులు ఎలా కడతారంటూ అప్పట్లో జగన్‌పై తీవ్రస్థాయిలో సెటైర్స్ వేశారు. దీంతో పాటు రింగురోడ్డు సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్ పనుల్లో నాణ్యతపై విమర్శలు వచ్చాయి. చాలా పనుల్లో నాణ్యతా లోపం ఉందని, కొన్ని పనులే చేయకుండా బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపధ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు అధికారులతో కూడిన బృందం ఏర్పాటు అయింది. ఎన్ని కోట్లతో పనులు చేపట్టారు.. అవి పూర్తయ్యాయా లేదా, క్వాలిటీ ఉన్నాయా.. ఎంబుక్, మినిట్ బుక్స్ అన్నింటినీ క్షుణ్ణంగా ఈ బృందం పరిశీలించనుంది. ఈ మేరకు శాఖల వారీగా విజిలెన్స్ బృందం నోటీసులు జారీ చేసింది. మొత్తానికి పాడా గుట్టు రట్టు కానుంది.

గుట్టల్లో 250 ఎకరాల ఆక్రమణ

- బోర్లు వేసి పంటల సాగు
- విచారణకు కలెక్టర్ ఆదేశం



ఆక్రమిత భూమిలో సాగుచేసిన మామిడి తోట

దువ్వూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో భూ ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. అయిదు కాదు పది కాదు.. ఏకంగా 250 ఎకరాలు నీలాపురం సమీప గుట్టల్లో ఆక్రమించి సాగు చేస్తున్నారు. ఆలస్యంగా ఈ భూ ఆక్రమణలు వెలుగుచూడ్డంతో దీనిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు.

మండల కేంద్రమైన దువ్వూరుకు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో నీలాపురం గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టలు నీలాపురం, దువ్వూరు, దాసరిపల్లె రెవెన్యూ పరిధిలోకి వస్తాయి. ఇక్కడ సర్వే నంబర్లు 294, 86, 1335, 230, 232, 235తో పాటు మరికొన్ని నెంబర్లలో విశాలమైన భూములు ఉన్నాయి. ఇక్కడ సుమారు 100 మందికి పైగా రైతులు ఈ భూములను సాగు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొందరు అధిక మొత్తంలో స్థలం ఆక్రమించి సాగుకు చేపట్టారు. ఇక్కడ కరెంటు తీగలు లాగి విద్యుత్తు సౌకర్యం ఏర్పరచుకున్నారు. కొన్నిచోట్ల బోర్లు వేశారు. ఆ నీటి ఆధారంగా ఎక్కువగా నువ్వు, వేరుశనగ సాగుతో పాటు మామిడి చెట్లు నాటారు. ఈ తతంగం సుమారు 12 సంవత్సరాలకు పైగా కొనసాగుతోంది. ఇన్నేళ్లుగా రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోలేదనేది అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన ఆదేశాలతో విచారణ మొదలు పెట్టడం విశేషం. అయితే సాగుదారులు తాము డీకేటీ పట్టాల కోసం అర్జీలు పెట్టామని వాదిస్తున్నారు. కొందరు సాగుదారులు ఏకంగా కోర్టును ఆశ్రయించారు. ఆ నేపథ్యంలో ఆక్రమిత భూముల విషయం ఎటు దారి తీస్తుందో వేచి చూడాల్సి ఉంది. కాగా.. సోమవారం జమ్మలమడుగు ఆర్డీవో ఆక్రమిత భూములను పరిశీలించిన విషయం విదితమే. మంగళవారం సైతం నీలాపురం వీఆర్వో చిన్న గంగయ్య ఆక్రమిత భూముల వద్దకు చేరుకుని అక్కడ సాగులో ఉన్న భూములు ఎవరివనే విషయం సర్వే నంబర్ల వారీగా పరిశీలించారు.

ఆక్రమిత భూమిలో విద్యుత్తు, బోరు, మోటారును పరిశీలిస్తున్న వీఆర్వో



పెనుశిల.. శేషాచల సోయగాలు



అందమైన ఘాట్‌రోడ్డు



చిట్వేలి-రాపూరుకు వెళ్లే ఘాట్ రోడ్డు, చూపరులను ఆకట్టుకునే అడవితల్లి అందాలు

- రాపూరు ఘాట్ రోడ్డులో ఆహ్లాదకర వాతావరణం
- వేసవిలోనూ తగ్గని పచ్చదనం

రాజంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య-నెల్లూరు సరిహద్దు అందాలు ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తున్నాయి. నెల్లూరు వైపు పెనుశిల అభయారణ్యం, అన్నమయ్య వైపు శేషాచల సోయగాలు ప్రయాణికులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుత వేసవిలోను పచ్చదనం పరుచుకుని ఉంది. లోయలు, కొండలు, రకరకాల చెట్లు, వన్యప్రాణులు, పెద్ద పెద్ద ఘాట్‌మార్గం, ఎన్నెన్నో మలుపులు, ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. చిట్వేలి నుంచి నెల్లూరు జిల్లా రాపూరుకు 30 కిలోమీటర్లు దూరం. ఇందులో 20 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డు మార్గమే ఉంటుంది. పెద్ద పెద్ద లోయలు, చూడచక్కని అందమైన చెట్లు, ఘాట్‌రోడ్ మనుషులను కట్టిపడేస్తున్నాయి. రెండు నెలల వరకు ఈ మార్గంలో అనేక సెలయేర్లు గల గల పారుతూ ఉండేవి. పెనుశిల అభయారణ్యం నుంచి వర్షాకాలంలో పారే నీరు ఇట్టే చూపరునలను కట్టిపడేస్తుంది. ప్రస్తుతం వేసవిలో నీరు తగ్గడం వల్ల జలపాతాల్లో కొద్ది కొద్దిగా మాత్రమే నీరు ఉంది. ఇటువైపున గుండాలేరు, అటువైపున పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కొండల నుంచి పారే నీటితో సెలయేర్లు పారుతూ ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చేవి. ప్రకృతి అందాలకు నెలవైన ప్రాంతంలో ఎర్రచందనం లాంటి ఎన్నో విలువైన అనేక రకాల భారీ చెట్లు ఈ మార్గంలో ఉన్నాయి. చిరుతలు, నెమళ్లు, జింకలు, తోడేళ్లు, నక్కలు, కణితులు, ఇలా అనేక రకాల వణ్యప్రాణులన్నీ ఈ ప్రాంతంలో ఉన్నాయి. అప్పుడప్పుడు ప్రయాణికులకు ఇవి కనిపిస్తుంటాయి. ఈ మార్గంలో పదుల కొద్దీ బస్సులు, వందలాది కార్లు, మోటారు సైకిళ్లు ఇతర వాహనాలు వెళుతుంటాయి.



అభయారణ్యంలో ప్రయాణికులను ఆకట్టుకునే జలపాతం (ఫైల్)

కలికిరిలో 15న దేశవాళీ

విత్తనాల పరిరక్షణ సదస్సు

- హాజరు కానున్న సీమ రైతులు

కలికిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ వంగడాలను పరిరక్షించి, అవసరమైతే బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు ముప్పై, నలభై ఏళ్ళ క్రితం వాడుకలో ఉన్న వరి, వేరుశెనగ, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర సంప్రదాయ వంగడాల విత్తనాలను సమీకరించి పరిరక్షించే బాధ్యతలను కలికిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అప్పగించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న కలికిరిలో రాయలసీమ స్థాయి దేశవాళీ వంగడాలు సాగుచేస్తున్న రెతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు.

రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని దేశవాళీ రకాలను కాపాడుకొస్తున్న రైతులు, రైతు సంఘాలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేటర్ వివరించారు. రైతులు తరతరాలుగా కాపాడుకొస్తున్న దేశవాళీ ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు (పూలతో సహా), పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తాము ప్రదర్శించబోయే రకాల గురించి ముందుగానే సమాచారం అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దేశవాళీ రకాలను సంరక్షిస్తున్న రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరేందుకు ఈ సదస్సు ద్వారా అవకాశం కలుగుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు, లేదా ఇతర వివరాల కోసం కేవీకే కోఆర్డినేటర్‌ను 8008500320 లేదా 9618934777 నంబర్లలోనూ లేదా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన (పశువైద్య విభాగం 9502888728), డాక్టర్ పీరూసాహెబ్ (సస్యరక్షణ 7989850004), డాక్టర్ ఎ.శ్రీనివాసులు (ఉద్యాన విభాగం 8008724284), డాక్టర్ మాధురి (విస్తరణ విభాగం 6303197399), డాక్టర్ ఎస్.సోమశేఖర్‌బాబు (సేద్య విభాగం 9440500167) లను సంప్రదించాలని కోరారు.

పుల్లంపేటలో భారీ చోరీ

160 గ్రాముల బంగారం, రూ.8 లక్షల నగదు...



ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్

పుల్లంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగులమాను వీధిలో నివాసం ఉంటున్న షేక్ మస్తాన్ ఇంటిలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో 160 గ్రాముల బంగారం, 8 లక్షల నగదు, 70 గ్రాములు వెండి మాయమైనట్లు బాధితుడు పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... బాధితుడు మస్తాన్ గల్ఫ్ ఏజెంటుగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి రాయచోటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కంటిలో నివాసం ఉంటున్న వారు మీ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి, మీరెక్కడున్నారంటూ ఫోన్లో అడిగారు. దీంతో రాయచోటిలో ఉన్న మస్తాన్ తమ బంధువులను ఇంటి వద్దకు పంపారు. ఇంటిలో చోరీ జరిగిన విషయం తెలుసుకుని వెంటనే రాయచోటి నుంచి పుల్లంపేటకు వచ్చారు. ఇంటిలో చోరీ జరిగిన విషయాన్ని పోలీసుస్టేసన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ సీఐ రమణ, ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ చోరీపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఎస్జీటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయండి

- కమిషనర్‌ను కోరిన ఎన్‌టీఏ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ఉన్న 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజుకు ఎన్‌టీఏ నాయకులు వినతిపత్రం సమర్పించారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు బుధవారం కమిషనర్‌తో మాట్లాడుతూ 2009లో రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారని, ఒక్క విజయవాడ కార్పొరేషన్‌లో 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను ఇంతవరకు అప్‌గ్రేడ్ చేయలేదన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లలోని ఉన్నత పాఠశాలల్లో అప్ గ్రేడ్ అయిన పాఠశాలలకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, అన్ని సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్లను మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే ప్రస్తుత బదిలీల్లో పదవీ విరమణ వయస్సు మూడు సంవత్సరాలలోపు ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, అలాగే విడాకులు పొందిన మహిళలకు ప్రత్యేక కేటగిరి కింద చూపాలని, 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసరావు, వైవీ చిట్టిబాబు, గోవిందు నాగరాజు, కోదండపాణి పాల్గొన్నారు.

అపార్ ఐడీ తప్పనిసరి : డీఈవో

సంబేపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల పేర్లు డ్రాప్ బాక్స్‌లో ఉంచరాదన్నారు. అలా ఉండే విద్యార్థులను తిరిగి చేర్చుకుని వారితో ఫొటో దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సమ్మిళిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదండరాముడి సన్నిధిలో ఎంపీలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయాన్ని కడప, రాజంపేట ఎంపీలు వేర్వేరుగా వచ్చి సందర్శించారు. ఉదయం కడప పార్లమెంట్ సభ్యుడు అవినాశ్‌రెడ్డి కోదండరామున్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గే భాస్కర్‌రెడ్డి, నందకిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోదండరామాలయంలో ఎంపీ మిథున్, ఎమ్మెల్యే ఆకేపాటి

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

డ్వామా పీడీ వెంకటరత్నం



పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం ఆదేశించారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని గుండాలపల్లె, ఓబనపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ముమ్మరంగా ఫారంపాండ్స్ పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధిలో అవినీతి రహితంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. పనుల్లో ఎక్కడా అవినీతి లేకుండా చేయాలని అధికారులను సూచించారు. ఫారంపాండ్స్ వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం అటవీశాఖ నర్సరీలో డ్వామా ద్వారా పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, అసిస్టెంట్ క్వాలిటీ అధికారి ఉమామహేశ్వర్, అటవీశాఖ డీఆర్‌వో డీపీ గురవయ్య, ఎఫ్‌బీవో ప్రసన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం

పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి



అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఈ

సుండుపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్ల సౌకర్యమే లక్ష్యమని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో బుధవారం మండలంలోని ఆరెమ్మ వీధిలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, కల్వర్టులను ఆయన పరిశీలించారు. అనంతరం చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారి నుంచి పూజారివాండ్లపల్లెకు తారు రోడ్డు ఏర్పాటుకు పరిశీలించారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. రోడ్ల పనుల్లో రాజీపడకూడదని, నాణ్యమైన రోడ్లను వేయాలని ఆదేశించారు. ఎక్కడెక్కడ రోడ్ల వసతి లేదో ఆరా తీశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి పల్లెల్లో మట్టి రోడ్లు లేకుండా చేస్తామన్నారు.

కారు, స్కూటర్ ఢీ : యువకుడు మృతి



వరుణ్‌కుమార్‌రెడ్డి మృతదేహం

రామాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి రామాపురం మండలం బండపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగుంట్ల వరుణ్‌కుమార్‌రెడ్డి (23) మృతి చెందినట్లు రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన వరుణ్‌కుమార్‌రెడ్డి కరెంటు పనులు చేసేవాడు. పనులు ముగించుకొని రాయచోటి నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా కమలాపురానికి చెందిన మధురమోహన్‌రెడ్డి కారులో రాయచోటికి వస్తూ ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో వరుణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ రహదారిలో పార్కింగ్

సిద్దవటం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో ఈనెల 11న సీతారాముల కల్యాణం సందర్భంగా కడప నుంచి వచ్చే భక్తుల వాహనాలు పెట్టుకోవడానికి పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి సాయినగర్, ఉప్పరపల్లె, మాచవరం, సాయిబాబా టెంపుల్, తదితర ప్రాంతాల్లో 13 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ సీతారాముల కల్యాణం సందర్భంగా కడప నుంచి వచ్చే భక్తులకు వాహనాలు నిలుపుదలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని, పార్కింగ్ ప్రదేశాల నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ కల్యాణం చూసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే పథకాలు

జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రానాయక్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయశాఖాధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన వ్యవసాయశాఖాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాన్ని ఈనెల 15తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కవిత, రైల్వేకోడూరు మండల వ్యవసాయ శాఖాధికారి జి.సుధాకర్, వ్యవసాయశాఖ టెక్నికల్ అధికారి శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట గనులను పరిశీలించిన

ఐబీఎం అధికారులు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు సంబంధిత అధికారులతో కలిసి మంగంపేట ఏపీఎండీసీ బ్రాంచ్ పరిధిలో ఉన్న గనులను బుధవారం పరిశీలించారు. మైనింగ్ ప్రక్రియలో భాగంగా బ్లాస్టింట్, ట్రాన్స్‌పోర్ట్స్, గ్రేడింగ్‌లను పరిశీలించిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మినరల్ అధికారులు మైనర్ మినరల్‌గా ఉన్న మంగంపేట గనులు మేజర్ మినరల్‌గా అధికారులు గుర్తించడంతో అందుకు సంబంధించిన ప్రక్రియను పరిశీలించారు. అలాగే మైనింగ్‌కు సంబంధించి పలు అంశాలపై మంగంపేట ఏపీఎండీసీ అధికారులతో చర్చించారు.

మంటలార్పేదెలా?

- ఫైరింజన్‌లకు నీరు కరువు
- ప్రైవేటు బోర్లే గతి
- 21 ఏళ్లుగా ఇదే పరిస్థితి
- సమస్యల వలయంలో అగ్నిమాపక కేంద్రం

ములకలచెరువు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు భగభగ మండుతున్నాడు. ఎండలు తీవ్రరూపం దాల్చాయి. అగ్ని ప్రమాదాలు జోరందుకున్నాయి. ఈ తరుణంలో మంటలు ఆర్పేందుకు ఫైరింజన్‌కు నీరు కరువైంది. 21 ఏళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా ఫైరింజన్‌కు నీటి సమస్య తీర్చే నాథుడే లేడు. చేసేది లేక ప్రైవేటు బోర్ల వద్ద ఫైరింజన్‌కు నీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అగ్నిమాపక కేంద్రంలో ఏళ్ల తరబడిగా నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడం లేదు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి 2004లో ములకలచెరువులోని సింగిల్‌విండో కార్యాలయంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ అగ్నిమాపక కేంద్రం పరిధిలో ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ప్రతి ఏటా వేసవిలో అత్యధికంగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగితే ఇక్కడి నుంచి ఫైరింజన్ వెళుతోంది. ఈ క్రమంలో అగ్నిమాపక కేంద్రాన్ని 2007లో మార్కెట్ యార్డులోని ఇరుకైన గదిలోకి మార్చారు. అగ్నిమాపక కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పక్కాభవనం లేదు. ఫైరింజన్‌కు నీటి వసతి కూడా కల్పించలేదు. ఫైరింజన్‌కు నీరు నింపాలంటే సిబ్బంది ప్రైవేటు బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఫైరింజన్‌కు నీటి వసతి లేక అగ్నిమాపక సిబ్బంది పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. ప్రస్తుతం ఓ కల్యాణమండపంలోని బోరులో నీరు నింపుకుంటున్నారు. అలాగే పక్కా భవనం లేక ఇరుకైన గదిలోనే సిబ్బంది ఉండాల్సి వస్తోంది. మొత్తం 14 మంది సిబ్బందికి గానూ ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఎనిమిది మంది ఫైర్‌మెన్‌లకు గానూ ఒక్కరే ఉన్నారు. సిబ్బంది కొరతతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అగ్నిమాపక కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు ముఖ్యంగా ఫైరింజన్‌కు నీటి వసతి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

27 రోజుల్లో 24 అగ్నిప్రమాదాలు

మారుమూల ప్రాంతం కావడంతో అగ్నిప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈనెల 1వతేదీ నుంచి ఇప్పటి వరకు 24 అగ్నిప్రమాదాలు జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అగ్ని ప్రమాదాల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. మారుమూల ప్రాంతాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ వెళ్లలేని పరిస్థితితి నెలకొంది.

పక్కా భవనానికి నిధులు మంజూరు



ములకలచెరువు అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.25 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా జరిగింది. భవన నిర్మాణం పూర్తయితే సమస్యలు పరిష్కారమవుతాయి. ఫైరింజన్‌కు నీటి వసతి కూడా కల్పిస్తారు. ఫైరింజన్ కండీషన్ బాగుంది. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వండి.

\- నరసింహులు, అగ్నిమాపక అధికారి, ములకలచెరువు



ప్రైవేటు బోరు వద్ద ఫైరింజన్‌కు నీరు పడుతున్న సిబ్బంది (ఫైల్)



మార్కెట్ కమిటీ కార్యాలయంలో అగ్నిమాపక కేంద్రం



ఈ-శ్రమ్.. కార్మికులకు వరం

నమోదులో అధికార యంత్రాంగం కసరత్తు

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పించి.. సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్మికులకు ఓ వరం లాంటింది. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ-శ్రమ్‌లో వివరాల నమోదుకు సమీప గ్రామ, వార్డు సచివాలయాలు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌ఈ) కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. ఈ పక్రియ పూర్తయ్యాక యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

జిల్లాలో మొత్తం 7.50 లక్షల మంది కార్మికుల వివరాలు నమోదు లక్ష్యం కాగా ఇప్పటికి 3,67,933 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రయోజనాలపై కార్మిక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తూ అసంఘటిత కార్మికులకు చేకూరే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకుంటే ప్రభుత్వ ప్రయోజనాలు వర్తిస్తాయి. ఈ-శ్రమ్‌లో నమోదు అయితే గుర్తింపు కార్డు అందజేస్తారు. పథకాన్ని అసంఘటిత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి.

- శ్రీకాంత్‌నాయక్, కార్మికశాఖ ఉపకమిషనర్, కడపజిల్లా

వీరంతా అర్హులే

18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు, ఈపీఎఫ్ సభ్యత్వం లేనివారు, ఆదాయ పన్ను పరిధిలోకి రానివారు అర్హులు. ఉపాధి హామీ కూలీలు, మత్స్యకారులు, భవన నిర్మాణ, పారిశుధ్య కార్మికులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, వ్యవసాయ, ఉద్యాన, పాడిపరిశ్రమ కూలీలు, కుమ్మరి, స్వర్ణకారులు, ఇతర చేతివృత్తులవారు, సేవా రంగంలో ఉన్నవారు, బిగ్ వర్కర్స్ జొమోటా, స్విగ్గి వంటి (ఫుడ్ డెలివరి కార్మికులు) కార్మికులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు

నమోదు ఉచితం

ఈ-శ్రమ్‌లో వివరాల నమోదుకు ఆ
ధార్‌కార్డు, బ్యాంకు
ఖాతా పుస్తకం జి
రాక్స్ పత్రాలు, ఆ
ధార్‌కు అనుసంధాన
మైన సెల్‌ఫోన్ నంబ
రు, నామిని ఆధార్ వివరా
లు అవసరం. వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్, కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ పక్రియ పూర్తిగా ఉచితం. ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. అంతా అయ్యాక యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

ప్రయోజనాలు ఎన్నో...

నమోదు అయిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ.2 లక్షలు, పాక్షికంగా గాయపడితే రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందుతుంది. వలస కార్మికులకు ఎంతో ఊరటనిచ్చే ప్రయోజనాలు కలుగనున్నాయి. ఈశ్రమ్‌లో నమోదు అయినవారు ప్రభుత్వ వృత్తి నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చు.



కార్మికుల వివరాలను రిజిస్టర్ చేస్తున్న లేబర్ ఆఫీసర్ పావని(ఫైల్‌ఫొటో)

ప్రకృతి వ్యవసాయంతో అందరికీ ఆరోగ్యం



బలసింగాయపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న డాక్టర్ బలరామ్‌కిషన్

చెన్నూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన రహిత వ్యవసాయం చేపట్టాలని.. తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారని మధ్యప్రదేశ్‌కు చెందిన కిసాన్ పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బలరాం కిషన్ అన్నారు. మండలంలోని బలసింగాయపల్లెలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలన్న లక్ష్యంతో అన్ని రాష్ట్రాల్లో కిసాన్ పాఠశాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పంటకు తెగుళ్ల వ్యాపిస్తుంటాయని, రసాయన మందులు ఇష్టానుసారం వాడుతున్నాం కాబట్టి తెగుళ్ల ఆశిస్తున్నాయని తెలిపారు. కషాయాలతో తెగుళ్లను పూర్తిగా నివారించవచ్చన్నారు. అలాగే రైతులు అడిగిన పలు సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. కాగా, ఆదర్శ రైతు బాలచంద్రుడు బలసింగాయపల్లెలో సాగు చేసిన పసుపు పంటను బలరామకిషన్ రైతులతో కలిసి పరిశీలించారు. అలాగే రసాయనాలతో సాగు చేసిన పసుపు పంట పరిశీలించారు. ఈ రెంటికీ తేడాను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ప్రకృతి సేద్యంతో సాగు చేసిన పసుపు రెట్టింపు దిగుబడి వచ్చిందని తెలిపారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ వెంకట్రమణ, ఆదర్శ రైతు చదిపిరాళ్ల ప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన



క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొన్న విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థల ఏజీఎం, కోఆర్డినేటర్లు తదితరులు

సీకేదిన్నె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించినట్లు కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల రాయలసీమ జోన్ హెచ్ఆర్ రిక్రూటర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మూడు విధాలుగా రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ చేసి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన కేఎస్ఆర్ఎం విద్యాసంస్థల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి, పీటీవో ఆఫీసర్స్ నాగరాజు, సిద్దిక్‌కు నారాయణ విద్యాసంస్థల ఏజీఎం, కోఆర్డినేటర్లు ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

జగన్‌కు పదవి పోయినా తగ్గని అహంకారం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా అహంకారం తగ్గలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మండిపడ్డారు. బుధవారం నగరంలోని హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన ప్రభుత్వంలో పోలీసులను ఇష్టమొచ్చినట్లు వాడుకొని ఇప్పుడు వారిని బట్టలూడదీసి నిలబెడతామనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. జగన్ హత్యా రాజకీయాల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఎన్ని హత్యలు జరిగాయో సమాధానం చెప్పాలన్నారు. వ్యవస్థలపై దాడి చేయడం జగన్‌కు అలవాటేనన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్, టీడీపీ నాయకులు అమీర్ ఖాసీం పాల్గొన్నారు.

చీనీ తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



అంకాళమ్మగూడూరులో చీనీ తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సింహాద్రిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని బలపనూరు, అంకాళమ్మగూడూరు, హిమకుంట్ల, సుంకేసుల, అహోబిళం గ్రామాల్లో చీనీ తోటలను బుధవారం శాస్త్రవేత్తలు రామకృష్ణ, కె.అరుణోదయం పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో చీనీ తోటలకు నీటి తడులు అధికంగా అందించడం, భూమిలో తేమ ఆరకపోవడంలో వేర్లు త్వరగా కుళ్లిపోయి చెట్లు క్షీణిస్తున్నాయని శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. చీనీ చెట్లు దెబ్బతినకుండా ఉండాలంటే నేల స్వభావంను బట్టి ఒక తడికి 60 లీటర్లు మించి నీరు ఇవ్వకూడదన్నారు. వేరుకుళ్ళు కనిపించిన తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే శాశ్వతంగా నివారించుకోవచ్చని రైతులకు వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి, వీహెచ్ఏలు శ్రీలేఖ, ఉష, దీపిక రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఎదుట మార్చి 24వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బట్టు కిశోర్‌బాబు (33) అనే వ్యక్తి మృతి చెందాడు. అయితే కిశోర్‌బాబు మృతి విషయంలో అనుమానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన విచారణ చేపట్టినట్లుసీఐ లింగప్ప తెలిపారు. మృతుడు కిశోర్‌బాబుకు అన్న వరుస అయిన దేవరపల్లి ఉదయ్‌కుమార్ ప్రొద్దుటూరు టౌన్‌లో మార్చి 20వ తేదీ ఓ కార్యక్రమానికి వెళ్లి అక్కడ వారిద్దరు ఘర్షణ పడినట్లు తెలిపారు. ఆరోజు నుంచి ఎలాగైనా ఆయనను చంపాలని ఉదయ్‌కుమార్ మార్చి 24వ తేదీ జమ్మలమడుగుకు ఏపీ39యూపీ3392 నెంబరు గల ఐచర్ వాహనంలో వచ్చి జమ్మలమడుగులో కిశోర్‌బాబుకు ఫోన్ చేసి నీ అంతు చూస్తానని చెప్పినట్లు విచారణలో తేలిందన్నారు. అదే రోజు రాత్రి ఐచర్ వాహనంలో ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ కేసును ఛేదించి నిందితుడు ఉదయ్‌కుమార్ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

గుంతకల్ రైల్వేడివిజన్‌లో కొత్త రైల్వేలైన్లు నిర్మించాలి

● రైల్వే సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



పులివెందుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు డివిజన్‌లో ఉన్న రైల్వేలైన్లే కాకుండా కొత్తగా రైల్వేలైన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుంతకల్ రైల్వేడివిజన్ పరిధిలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ గుంతకల్ రైల్వేడివిజన్‌లో గతంలో పలు స్టేషన్లలో రైళ్ల ఆగుతున్నా వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. అవసరం ఉన్న చోట మళ్లీ స్టాపింగ్‌లను పునరుద్ధరించాలన్నారు. ముదనూరు-ముదిగుబ్బ కొత్త రైల్వేలైన్‌ను ఏర్పాటుకు గుంతకల్ డివిజన్ చొరవ చూపాలన్నారు. ఈ రైల్వేలైన్ కేవలం 65కిలోమీటర్లు మాత్రమే నిర్మిస్తే కడప, నంద్యాల జిల్లాల వారిని సత్యసాయి జిల్లాతో అనుసంధానం ఏర్పడుతూ కర్ణాటక రాష్ట్రంతోను అనుసంధానించవచ్చన్నారు. కడప, నంద్యాల ప్రజలకు బెంగుళూరకు పోయేందుకు సరైన రైలు సౌకర్యం లేదన్నారు. ఈ ప్రాంతాల నుంచి ప్రతినిత్యం పారిశ్రామిక ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేయడం సులభతరమ వుతుం దన్నారు. గతంలో
హుబ్లీ-తిరుపతిల మధ్య ప్యాసింజర్ రైలు,
గుంతకల్-విజయవాడ మధ్య
నడిపేవారన్నారు. ఈ రైల్లు పేద లకు
ఎంతో ఉపయోగకరంగా ఉండేవన్నారు.
అది రద్దుచేయడం వల్ల ప్రజలు
ఇబ్బందిపడుతున్నారన్నారు.
కడప-అనంతపురం-
రేణిగుంట-రాయచూర్ రైల్వేస్టేషన్లలో
మొన్నటి వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8
వరకు రిజర్వేషన్ టికెట్ ఇచ్చేవారన్నారు. కానీ
ఉన్నపలంగా రిజర్వేషన్ సమయాన్ని కుదించి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు మాత్రమే రిజర్వేషన్ కౌంటర్లను తెరుస్తున్నారన్నారు. ఇది ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇక ధర్మవరం-మచిలీపట్నం రైళ్లను కొండాపురంలో ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హరిప్రియ ఎక్స్‌ప్రెస్, గోవా-తిరుపతి ఎక్స్‌ప్రెస్, చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్, ఎంజీబీ చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్‌రైళ్లను రైల్వేకోడూరులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.



రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారం వద్ద బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయసున్న మృతుడు ఎరుపు ఆకుపచ్చ తెలుపు కలిగిన చొక్కా ధరించి.. ఎడమకాలు మడిమ వద్ద కట్టు కట్టుకొని ఉన్నాడు. వివరాలు తెలిస్తే 9440627658 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్లు అరెస్టు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో బుధవారం మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఉమ్మడిశెట్టి ఆదిలక్ష్మి, మేషా స్వరూప, గుర్రం చిన్నచెన్నయ్య మట్కా నిర్వహిస్తుండగా అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మట్కా పట్టీలతో పాటు రూ.26,050 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చాపాడు ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

చాపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండల ఎస్ఐ చిన్నపెద్దయ్యపై ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఈనెల 7వ తేదీన సోమవారం ఫిర్యాదు చేసినట్లు నాగులపల్లె గ్రామానికి చెందిన సానా నరసింహారెడ్డి తెలిపారు. తన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డిపై ఎస్ఐ, ట్రైనింగ్ డీఎస్పీ భవానీ వేదిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 29.09.2024వ తేదీ విద్యాసాగర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డిని కారుతో ఢీకొట్టినట్లు హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయమై అప్పట్లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి వారు ఫిర్యాదును తీసుకోలేదన్నారు. హైకోర్టులో పిటీషన్ వేయగా కోర్టు ఫిర్యాదును స్వీకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మళ్లీ ఎస్పీ, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ఇటీవల అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 3వ తేదీ చాపాడు పోలీసు స్టేషన్‌లో ట్రైనింగ్ పొందుతున్న డీఎస్పీ భవానీ తన కుమారుడు విద్యాసాగర్ రెడ్డిని పోలీసు స్టేషన్‌కు పిలిపించుకుని బైండోవర్ కేసు నమోదు చేస్తామని ఎస్ఐ, భవానీ బెదిరించినట్లు వారు ఆరోపించారు. ఎస్ఐపై విచారణ జరపాలని కోరామన్నారు.

ఈ విషయమై ఎస్ఐ చిన్నపెద్దయ్యను ఫోన్‌లో వివరణ అడుగగా సానా నరసింహారెడ్డిని కానీ, ఆయన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డిని కానీ బెదిరించలేదన్నారు. చట్ట ప్రకారమే వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కడప జలవనరుల శాఖ డీఈఈ ధనంజయులుకు ఊరట

కలికిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్-1 డివిజన్ డీఈఈ ధనంజయులుకు ఊరట దక్కింది. ఆయనపై నమోదైన కొన్ని అభియోగాల నుంచి ఆయనకు విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమశిల ప్రాజెక్టు కోసం భూములు సేకరించే క్రమంలో జిల్లాలోని అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామంలోని చౌటపల్లెలోని సర్వే నంబర్లు 15, 16/1, 19/3లోని భూములను పరిశీలించడంలో తప్పుడు నివేదికలను పంపిన కారణంగా ఆయనపై అభియోగాలు నమోదు చేసి 2024 మార్చి 4న సంజాయిషీలు కోరారు. అదే నెల 27న ఒకసారి, జూన్ 10న మరోసారి ధనంజయులు తన వివరణలను సమర్పించారు. తన తనిఖీల సమయంలో భారీ వరదల కారణంగా తాను నైపుణ్యంలేని కూలీలతో పనులు చేయించాల్సి వచ్చిన కారణంగా కొన్ని మానవ తప్పిదాలు జరిగినట్లు అంగీకరించారు. ధనుంజయులు సమర్పించిన సంజాయిషీలపై ప్రభుత్వం కడప ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈని విచారణాధికారిగా నియమించింది. ఆయన అందజేసిన విచారణా నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ధనుంజయులుపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రొద్దుటూరు కోర్టుకు ఏపీపీ నియామకం


కలికిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. న్యాయవాది మార్తాల సుధాకర్ రెడ్డిని ఏపీపీగా నియమించారు. నెలకు రూ.40 వేల గౌరవ వేతనంతో మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారని పేర్కొంటూ రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

పాఠశాలల ప్రారంభ సమయానికి విద్యార్థి కిట్టు అందజేయాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రారంభం సమయానికి విద్యార్థి కిట్టు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం వేసవి సెలవుల్లోని విద్యార్థి కిట్టులోని అన్నిరకాల సామాగ్రిని జిల్లా, మండల, స్కూల్ పాయింట్‌కుచేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రాష్ట్ర అబ్జర్వర్ వీవీకే ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దవటం, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, ఖాజీపేట, కడప మండలాలస్టాక్ పాయింట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్లలో స్టాక్ భద్రపరిచే సమయంలో ఎటువంటి ఇబ్బందికి కలగకుండా ప్రదేశాలను చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాసమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ కోఆర్డినేటర్ దశరథరామ్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి-2 షేక్ ఇర్షాద్ అహ్మద్, మండల కమిటీ సభ్యులు దేవ సహాయం, సాగర్, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కుందూలో జలకళ

రాజుపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది సకాలంలో వర్షాలు లేక ఏప్రిల్ మాసంలో కుందూనది పూర్తిగా ఎండిపోయింది. అయితే ఈ సంవత్సరం సకా లంలో వర్షాలు పడడంతో కుందూలో నీళ్ల ప్రవహి స్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుందూ నది పరివాహకం వెంబడి ఉన్న పొలాల్లో పూలతోటలు, వరి, నూగు, కొర్ర పంటలు సాగు చేశారు. ఈ పంటలకు పుష్కలంగా నీళ్ల అందుతుండటంతో కళకళలాడుతున్నాయి. అదే విధంగా పశువుల దాహార్తి తీర్చేందుకు కుందూ నీరు ఉపయోగపడుతోంది. ఏది ఏమైనా ఏప్రిల్, మే మాసంలో నదిలో నీటి ప్రవాహం ఉండటంతో తరువాత వర్షాలు పడేంత వరకు ఇబ్బంది ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థుల భవిష్యత్తు ప్రధానలక్ష్యం కావాలి

కడప ఎడ్యుకేషన్,ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు ప్రధాన లక్ష్యం కావాలని వైవీయు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యావిధానం-2020ని ప్రకారం విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని శాఖల ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు స్టడీ చేసేందుకు ఆయన పలు విభాగాలను సందర్శించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ విజయభారతి, ఎంసీఏ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ రెడ్డయ్య పవర్ పాయింట్ ప్రజెటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి వివరించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ నైపుణ్య కేంద్రాలు, విద్యా ప్రయోగశాలలు, పరిశోధన ల్యాబ్‌ల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టించేందుకు పరిశ్రమలు, సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

నెట్టికంటి అంజన్న ఆలయానికి ఎమ్మెల్సీ విరాళం

పులివెందుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్ సమీపంలోని కసాపురం గ్రామంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి లక్ష రూపాయల చెక్కును ఆలయ కమిటీకి అందించారు. బుధవారం ఆయన నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానానికి కూరగాయల సరఫరా కోసం అవసరమైన నాలుగు చక్రాల వాహన కొనుగోలు విషయమై ఈ చెక్కును ఆలయ అధికారులకు అందించారు. ఏఈవో వెంకటేశ్వర్లు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అధికారులకు విరాళం చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేసవిలో అందరికీ ఉపాధి పనులు

● డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

చెన్నూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉపాధి పనుల సంఖ్య పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి అన్నారు. మండలంలోని శివాలపల్లె పంచాయతీలో ఉన్న గోపవరంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ వేసవిలో అన్ని రకాల కాల్వలు చేసుకునే వెసులుబాటు వచ్చిందని, పంట కాల్వలన్నీ ఎలాంటి ఇబ్బంది లేకండా చేసుకోవచ్చన్నారు. ప్రధాన కాల్వలో నీరు తగ్గగానే అక్కడ కూడా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి నుండి జూన్ వరకు చేసిన పనులకు రూ.20నుంచి రూ.30వరకు అదనపు కూలీ వస్తుందన్నారు. రూ.60కోట్లు ఉపాధి పనుల బిల్లులు పెండింగులో ఉన్నాయని, అందుకు సంబంధించిన నిధులు ఈనెల 17లోగా వస్తాయన్నారు. అలాగే గోకులం షెడ్లకు సంబంధించి రూ.11 కోట్లు అవసరమని, ఆ నిధులు కూడా వస్తాయన్నారు. అనంతరం అదే ప్రాంతంలో ఉపాధి కూలీలు తవ్విన కాల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో శైలజ, సీసీలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు రేపు ఇంటర్వ్యూలు

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిరుద్యోగ మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం భాగ్యమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆదిత్య బిర్లా గార్మెంట్స్ కంపెనీలో ఉద్యోగాల నియామకం కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వికలాంగుల కాలనీలో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వహోమియో వైద్యుడు షాకీర్‌హుసేన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిష్టియన్ ఫెడరీ శామ్యుల్ హనీమన్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 10న ప్రపంచ హోమియో దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వరిగడ్డికి రెక్కలు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మూగజీవాలకు గ్రాసం, నీరు కరువైంది. బయటిప్రాంతాల నుంచి ఎండుగడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పశుపోషణ రైతులకు తలకు మించిన భారంగా మారింది. మార్చి నుంచి జూన్ వరకు గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను కాపాడుకోలేక సగానికి సగం అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. డొక్కలు ఎండి బక్కచిక్కుతున్న పశువులను చూసి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు.



● గ్రాసం కొరతతో మూగజీవులు విలవిల
● భారంగా మారిన పశు పోషణ
● ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు
● ట్రాక్టరు గడ్డి రూ.15వేలు



పులివెందుల టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతంలో వ్యవసాయం తరువాత ప్రధాన జీవనాధారం పాడి పరిశ్రమే. పులివెందులలో 50వేలకు పైగా తెల్ల, నల్ల పశువులున్నాయి. వర్షాభావం ధాటికి పొలాలు బీడుగా మారడంతో ఎక్కడా పచ్చిక దొరికే పరిస్థితి లేదు. దీంతో ప్రొద్దుటూరు, నందిమండలం నుంచి వచ్చే ఎండుగ్రాసం ట్రాక్టరు రూ.15వేలుగా జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో కొనే పరిస్థితి లేక మెట్ట రైతులకు పశుపోషణ భారంగా మారింది. సంవత్సరానికి ఆరేడు నెలలు పాలిచ్చే గేదెలు, 3, 4 నెలలకు ఎండిపోతున్నాయని పశుపోషకులు వాపోతున్నారు. అయితే అంత ధరలు వెచ్చించలేక పశువులను పొలాలు, బంజరు భూముల్లోకి మేత కోసం తీసుకెళ్లినా ఎండుగడ్డి కూడా దొరకడం లేదని వాపోతున్నారు. కనీసం రోజుకు రెండుపూటలైనా వరిగడ్డి, పొట్టు కొద్దిగా వేస్తే పాలైనా ఇస్తున్నాయంటున్నారు. కొంతమంది ఇప్పటికే వలసలు తీసుకెళ్లారు. గొర్రెల పోషకులు మరింత కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా పశుగ్రాసం, దాణా సరఫరా చేయాలని పశు పోషకులు కోరుతున్నారు. ఇక సేద్యపనుల కోసం పశువులపై ఉన్న అభిమానంతో కాడెద్దులను పోషిస్తున్న రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఏదిఏమైనా పశు సంపదను కాపాడుకోవడం రైతులకు గగనంగా మారింది.

సమస్యల పరిష్కారానికి కృషి

● ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న గుండారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుండారెడ్డి అన్నారు. బుధవారం హోటల్ హరితలో యోగివేమన యూనివర్సిటీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల అఫ్లియేషన్ ఇవ్వాలని, జీవో నెంబర్ 22 రద్దు చేసి డిగ్రీ ఫీజు నిర్ణయ విధానం పాత పద్ధతిలో కొనసాగించాలన్నారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. అఫ్లియేషన్ ఫీజులో జీఎస్టీ తీసివేయాలని, పరీక్ష విధానంలో నూతన ఒరవడితో పటిష్ఠమైన వ్యవస్థను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాం, నాయకులు శౌరిరెడ్డి, జి.వెంకటరెడ్డి, సురేంద్రరెడ్డి, మహానందయ్య, సుబ్బారెడ్డి, వివిధ కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ భవనాన్ని సుందరీకరించాలి'

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని వై-జంక్షన్‌లో ఉన్న భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని సుందరీకరించాలని టీడీపీ ఎస్సీ సెల్ నగర కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితులకు ఉపయోగకరంగా ఉండేలా అంబేడ్కర్ భవనాన్ని ఆధునీకరించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఓబులేసు, నగర ప్రధాన కార్యదర్శి రాయుడు, 5వ డివిజన్ ఇన్‌చార్జి కొమ్మలపాటి సురేష్, చక్రి, జీవన్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రోలు డీజిలు ధరలు తగ్గించాలి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, డీజిలు, పెట్రోలు ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేలూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 అదనపు పెంపు దారుణమన్నారు. ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న తరుణంలో నిత్యావసరాలైన గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమేనన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకంపై కూడా భారం పడుతుందన్నారు. కావున పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప రూరల్ ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షాకాలాన్ని పూర్తి చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ అన్నారు. బుధవారం ఆయన సెంట్రల్ జైలును విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి ఖైదీలకు వివరించారు. హైకోర్టు దోషిగా నిర్ధారించిన వ్యటికి సుప్రీంకోర్టులో అపీల్ విషయం, శిక్ష నుండి ఉపశమనం పొందేందుకు అర్హత ఉన్న ఖైదీలను గుర్తించడం, తదితర అంశాలను వివరించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

పులివెందుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక ఆలయం సమీపంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ప్రారంభించారు. విజయ పాల డెయిరీ యజమాని రామకృష్ణారెడ్డి గత ఐదేళ్లుగా నెల రోజుల పాటు ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

విద్యార్థుల రక్తదానం

పెండ్లిమర్రి,ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం బోగా పార్వతమ్మ రక్తదాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, కాబట్టి రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.



విద్యార్థికి పండ్లు అందిస్తున్న ప్రిన్సిపాల్

ఆరోపణలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టండి

● వైసీపీ నేతల హితవు

పులివెందుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆరోపణలు మాని సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిపై దృష్టిపెట్టాలని వైసీపీ నేతలు కూటమి నాయకులకు హితవు పలికారు. బుధవారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, నూర్ బాష సంఘం అధ్యక్షుడు రసూల్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి రైతులు ఉద్యానపంటలు విరివిగా సాగు చేస్తున్నారంటే దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన కృషిఫలితమేనన్నారు. కృష్ణాజలాలు తెప్పించేందుకు వైఎస్ చేసిన కృషి ఇక్కడి రైతాంగానికి తెలుసునన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో తండ్రికి తగ్గ తనయుడు అని పించేలా కోవిడ్‌లో సైతం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి నాయకులు ఇప్పటి వరకు ఎన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, హాల్ గంగాధర్‌రెడ్డి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కడపక్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కడప నగరం తిలక్‌నగర్ బైపాస్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంలో చెన్నూరు వైపు వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

లింగాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిదండ్ల గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎగువలంగాల గ్రామానికి చెందిన రవితేజ, చరణ్, వెంకటనాథ్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకెళితే... పార్నపల్లె గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో ముగ్గురు యువకులు లింగాలకు బయలుదేరారు. వెలిదండ్ల గ్రామ సమీపంలోకి రాగానే మలుపు వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో చరణ్‌ను కడపకి, వెంకటనాథ్‌ను తిరుపతికి చికిత్స కోసం తీసుకెళ్లినట్లు తెలిసింది.

'దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి'

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాద్ కోరారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ హక్కుల రక్షణ కల్పించాలని, క్రైస్తవులపై దాడులు నివారించాలని కోరారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ హత్యను సీబీసీఐడీతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతిర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీఎఫ్ కడప జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్, బిషప్ డానియల్ కృష్ణదాస్, పాస్టర్లు డేవిడ్ రాజ్, రాజన్న, కిరణ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

20 రోజుల్లో బ్రిడ్జి పనులు ప్రారంభం

● రూ.20కోట్ల నిధులతో నిర్మాణం
● ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మరో 20 రోజుల్లో రవీంద్రనగర్ షహమీరియా బ్రిడ్జి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం షహమీరియా బ్రిడ్జి స్థలాన్ని వారు పరిశీలించి కార్పొరేషన్ అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా, అవగాహన రాహిత్యంతో వ్యవహరించిందన్నారు. ప్రతి ఏడాది టెంకాయలు కొట్టడం జరిగిందన్నారు. కానీ ఎన్నికల ముందు శ్రీనివాసరెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్పెషల్ పర్మిషన్ తీసుకువచ్చామని తెలిపారు. ఈ పనులను రూ.20కోట్ల నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. గత పదేళ్ల వైసీపీ పాలనలో కడప కార్పొరేషన్‌లో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కడపను గంజాయి నగరంగా మార్చారని ఆరోపించారు. భూ ఆక్రమణలు అవినీతికి వైసీపీ ఫేమస్ అని అన్నారు. అయితే తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కడప అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అరాచక పాలన చేస్తున్న కూటమి : ఎంపీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన కొనసాగుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఎంపీ అవినాష్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వైసీపీ నేత అహ్మద్ బాషా అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేవలం రాక్షసానందం పొందేందుకే అరెస్టుల పర్వానికి తెరతీయడం సిగ్గుచేటన్నారు. 2022లో నమోదైన కేసు 2025లో నాన్‌బెయిలబుల్‌గా నమోదు చేసి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కేసులో పిటీషనర్లు సంవత్సరం క్రితమే కాంప్రమైజ్ పిటీషన్‌ను కోర్టులో వేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవలం కక్ష సాధించేందుకు మాత్రమే ఇటువంటి కార్యక్రమాలను టీడీపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, పలువురుపాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు అన్యాయం

● సీఐటీయూ

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తృత వనరులు, వ్యాపారం, సేవలు, టెక్నాలజీ, అన్నిఅంశాల్లో ఏపీజీబీ జాతీయ స్థాయి రికార్డులు సాధించిందని, కానీ ఏపీజీబీ ఉన్న కడపలో ప్రధాన కార్యాలయం లేకుండా అమరావతిలో ఏర్పాటుచేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. అరుణాచల్‌ప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్‌లలో తాజాగా కర్ణాటకలో రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాలు ఆ రాష్ట్రాల రాజధానులు, నడిబొడ్డున కానీ లేవన్నారు.

'పోలీసులపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం'

● టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేశ్

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోలీసులు, ప్రభుత్వంపైన జగన్ ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేశ్ అన్నారు. బుధవారం నగరంలోని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడులో పర్యటించిన జగన్ పోలీసుల బట్టలు ఊడదీస్తానంటూ మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. చట్టబద్ధమైన ప్రభుత్వం పైన, పోలీసులపైన అహంకారపూరితంగా మాట్లాడితే ప్రజలు జగన్ సీట్లే కాదు బట్టలు ఊడదీయడానికి కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హమీద్, కార్యదర్శి అక్షయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు బిల్లా నవీన్, రామ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలేశ్

పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

● ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాదుల్లా

వేంపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీకి వెంటనే ఈవోను నియమించి పారిశుధ్య, నీటి సరఫరా సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాదుల్లా డిమాండ్ చేశారు. వేంపల్లెలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల రోజులుగా ఈవో లేకపోవడంతో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితి ఉందని, పారిశుధ్య పనిముట్లు, వాహనాలు అందుబాటులో లేవన్నారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, ప్రసాద్, రత్నం పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం నడుం బిగించాలి

● ముస్లిం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్

కడప మారుతీనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికే పరిమితం కాకుండా మహిళా సాధికారత కోసం నడుం బిగించాలని ముస్లిం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ త్రీవే సంస్థ వ్యవస్థాపకురాలు, ఎస్ఆర్ఐ రషీదా సారథ్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ప్రత్యేక మహిళా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు రషీదాను అభినందించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సంస్థ అధ్యక్షుడు మస్తాన్, జనవికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు మన్సూర్‌అలీఖాన్‌తో పాటు ఐఈఎంఎల్ రాష్ట్ర నాయకుడు అలీషేర్, తాజుద్దీన్, న్యామతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో మొక్కల పెంపకం

సీకేదిన్నె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్‌లో శాంతిసేవా సొసైటీ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం చేపట్టినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కడపలో బిషప్ ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం ఇందిరానగర్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అంకాళమ్మ ఆలయ చైర్మన్‌గా సోమకొండారెడ్డి

సింహాద్రిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంకాళమ్మ దేవస్థానం చైర్మన్‌గా కె.సోమకొండారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గతంలో సోమకొండారెడ్డి ఆలయ చైర్మన్‌గా ఉన్నారు. ఆ తర్వాత రెండేళ్ల పాటు అశోక్‌రెడ్డి చైర్మన్ బాధ్యతలు నిర్వహించారు. బుధవారం జరిగిన చైర్మన్ ఎంపికపై గ్రామపెద్దలు, గ్రామస్థుల మద్దతుతో సోమకొండారెడ్డిని మళ్లీ ఎన్నుకున్నట్లు ప్రస్తుత చైర్మన్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బాధ్యతలు స్వీకరించిన సోమకొండారెడ్డి తెలిపారు.



సోమకొండారెడ్డిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

అన్నదాతలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా..



ఎస్.శివశంకర్‌రెడ్డి
వ్యవసాయాధికారి, ప్రొద్దుటూరు

ఫేస్ టు ఫేస్

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారిని చైతన్యపరుస్తున్నామని ప్రొద్దుటూరు మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం పై రైతులు దృష్టి సారించేలా వారిని చైతన్యపరుస్తున్నామని 'ఆంధ్రజ్యోతి' ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: రబీ సీజన్‌లో ఎన్ని ఎకరాలు సాగు చేశారు?

జవాబు: మండల విస్తీర్ణం 25 వేల ఎకరాలు ఉండగా ప్రస్తుతం రబీలో 17 వేల ఎకరాలు సాగులో ఉంది.

ప్రశ్న: మండలంలో ప్రధాన పంటలు, జలవనరులు ఏమున్నాయి?

జవాబు: బుడ్డశనగ, వరి, మినుము, జొన్న, తదితర ప్రధాన పంటలు సాగులో ఉండగా కేసీ కాలువ, మైలవరం ఉత్తర కాలువ, కుందూ పరివాహక ప్రాంతం ప్రధాన జలవనరులు.

ప్రశ్న: ఉద్యాన పంటలు ఏవి సాగు చేస్తున్నారు?

జవాబు: మండలంలో మామిడి, పసుపు, చీనీ, సపోట, జామ, తదితర పంటలు సాగులో ఉన్నాయి.

ప్రశ్న: ఈ-పంట నమోదు ఎంత వరకు వచ్చింది?

జవాబు: రబీలో 14,250 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తి చేశాం.

ప్రశ్న: పీఎం కిసాన్‌తో ఎంత మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు?

జవాబు: 4,820 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు.

ప్రశ్న: వరిలో మంచి రకాలు ఏవేవి?

జవాబు: బీపీటీ-5204, ఆర్‌ఎన్‌ఆర్-1548, జేజీఎల్-389, ఎన్‌డీఎల్-67, ఎన్‌డీఎల్-68 రకాలు మంచివి.

లక్షలు వెచ్చించినా.. నెరవేరని లక్ష్యం

- నిరుపయోగంగా కూరగాయల మార్కెట్
- మార్కెట్ బయటి ప్రాంతంలోనే వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపారులు
- మున్సిపల్ ఆదాయానికి గండి
- ఎండను తట్టుకునేందుకు ప్లాస్టిక్ పట్టలతో సేదదీరుతున్న వైనం
- పాలకులు స్పందించాలని విజ్ఞప్తి



నిరుపయోగంగా మారిన మార్కెట్ ఎదురుగా వ్యాపారులు నీడకోసం ఏర్పాటు చేసుకున్న ప్లాస్టిక్ పట్టలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారి లక్ష్యం నెరవేరడంలేదు. దీంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. జమ్మలమడుగు మున్సిపాలిటీలో ప్రధానమైన కూరగాయల మార్కెట్‌తోపాటు కరోనా సమయంలో సంజాముల మోటు సమీపాన ఏర్పాటు చేసిన మినీ మార్కెట్ నిరుపయోగంగా మారాయి. పై రెండు మార్కెట్లు వ్యాపారస్థులకు ఉపయోగ పడడం లేదని వాపోతున్నారు. ప్రధాన కూరగాయల మార్కెట్‌ను 2018లో రోడ్డుపై నుంచి ఎత్తుగా నిర్మించడం వలన కూరగాయల కోసం మార్కెట్‌కు వచ్చేవారు మెట్లు ఎక్కి రాలేకవెనక్కి వెళ్లిపోతున్నారు. దీంతో వ్యాపారులు ఎలాగైన తమ వ్యాపారాలు దెబ్బతినకుండా ఉండాలని మార్కెట్ బయటి ప్రాంతంలోనే కూరగాయలను విక్రయిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల వ్యాపారాలు కొనసాగించడమే కాకుండా మధ్యాహ్న వేళలో నీడకోసం బెడ్‌సీట్, ప్లాస్టిక్ పట్టలు వేసుకుని సేదదీరుతున్నారు.

గేటు వసూళ్లకు తప్పని గండి

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారడం. వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడ వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో మున్సిపల్ గేటు వసూళలకు గండిపడుతోందని పలువురు వాపోతున్నారు. గత నెలలో కూరగాయల మార్కెట్ సంబంధించి వేలం పాటలు నిలిచిపోయాయి. అప్పటి కొన్ని రోజులు మాత్రమే గేటు వసూళ్లు చేయలేదని, ఇటీవల వారం రోజుల నుంచి గేటు వసూళ్లు కూరగాయల మార్కెట్‌లో వ్యాపారాలు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వసూలు చేసి మున్సిపల్ అధికారులకు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతున్నట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. జమ్మలమడుగులో కూరగాయల మార్కెట్ వ్యాపారులకు అవస్థలు తప్ప ప్రయోజనం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా కూరగాయల మార్కెట్ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద వ్యాపారులకు లిఫ్ట్ ఏర్పాటు చేయుటకు పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

- సీఎం చంద్రబాబును కోరిన ప్రవీణ్‌కుమార్ రెడ్డి



సీఎం చంద్రబాబును కలిసిన ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో పార్టీకోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి సీఎం చంద్ర బాబునాయుడును కోరారు. బుధవారం విజయవాడ లో సీఎం చంద్రబాబును ప్రవీణ్ రెడ్డి కలిసి వైసీ పీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై బనాయించిన అక్రమకేసులు రౌడీషీట్లు తొలగించాలని కోరారు. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్ వేసి విచారణ జరిపించాలన్నారు. మార్కెట్ నిర్మాణం కోసం మున్సిపాలిటీ నిధులు కొరత కారణంగా ప్రభుత్వమే నిధులు ఇచ్చి పూర్తిచేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ 500 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మొక్కుబడిగా సాగిన మండల సమావేశం



సమావేశంలో సమస్యలు వివరిస్తున్న కల్లూరు సర్పంచ్ శివలక్ష్మి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రొద్దుటూరు ప్రాంతంగా ప్రకటించిన బుధవారం జరిగిన మండల సమావేశం వాటి గురించి ప్రస్తావన లేకుండానే మొక్కుబడిగా సాగింది. బుధవారం మండల సమావేశం ఎంపీపీ శేఖర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ ఒంటిమిట్టలో జరిగే బ్రహ్మోత్సవాల విధులకు వెళ్లడంతో హాజరుకాలేకపోయారు. పంచాయతీ పరిదిలోని 15 మంది సర్పంచులకుగాను తొమ్మిది మంది, 24 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను 18 మంది హాజరయ్యారు. కోఆప్షన్ మెంబర్ గైర్హాజరు కాగా ఈ సమావేశానికి రెవెన్యూ శాఖ నుంచి ఎవ్వరు కూడా హాజరుకాలేదు. ఈ సందర్భంగా కల్లూరు సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి మాట్లాడుతూ పెన్నానదిలో ఇసుక రవాణా వలన గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయని, వాటిని రూటు మార్చి కొత్త పైపులైను వేసేందుకు పంచాయతీ తీర్మాణం అయినా అధికారులు పనులు చేయకుండా నిలిపివేయడంఏమిటని ప్రశ్నించారు. ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ బాలన్న, హౌసింగ్ డీఈ గురుప్రసాద్, కామనూరు, కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బిషప్ పట్టాభిషేకానికి తరలివెళ్లిన విశ్వాసులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కడప కేథలిక్ మేత్రాసనానికి నూతనంగా ఎన్నికైన బిషప్ డాక్టర్ సగినాల ప్రకాశ్ పట్టాభిషేక మహోత్సవానికి పోరుమామిళ్ల నుంచి ఓబులాపురం శోభనకుమార్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల కేథలిక్ విశ్వాసులు పది బస్సుల్లో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ ఇప్పుడు కడప మేత్రాసన గురువే బిషప్ కావడంతో విద్య, ఆరోగ్యం, ఆధ్యాత్మిక రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ఎస్ఐగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



కొండాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొండాపురం ఎస్ఐగా యు.ప్రతాప్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీపై ఆయన కమలాపురం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న విద్యాసాగర్ బదిలీపై కమలాపురం వెళ్లడంతో ఆయన స్థానంలో వచ్చారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలో పలు చోట్ల ఎస్ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. యువత అసాంఘిక కార్యకలపాల జోలికి వెళ్లవద్దని సూచించారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



ఇన్‌చార్జ్ చైర్మన్ ఖాజాతో వాదిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ బుధవారం సమావేశం వాడీవేడిగా సాగింది. చైర్‌పర్సన్ లక్ష్మీదేవి గైర్హాజరవడంతో వైస్ చైర్మన్ ఖాజా సభకు అధ్యక్షత వహించారు. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సభకు హాజరయ్యారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కౌన్సిల్ సమావేశం సుదీర్ఘ చర్చలతో సాగింది. ముఖ్యంగా 15 టెండర్ల ఆమోదంపై వైసీపీ టీడీపీ సభ్యుల మధ్య సుదీర్ఘ చర్చ సాగింది. సింగల్ టెండర్లు, తక్కువ లెస్‌కు వేసుకున్న పనులను రద్దు చేయాలని టీడీపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే పట్టుబట్టారు. దీనిపై వైసీపీ సభ్యులు ఓటింగ్‌కు పట్టుబట్టి సభాధ్యక్షుడు ఖాజాతో సహా 20 మంది ఓటింగ్‌లో పాల్గొని మెజారిటీ నిరూపించుకున్నారు. ఈ టెండర్లు రద్దు చేయాలని కోరుతూ ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి 16 మంది టీడీపీ కౌన్సిలర్లు కాంగ్రెస్, జనసేన నుంచి ఇద్దరు కౌన్సిలర్లు డిసెంట్ ప్రకటించారు. కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లన్ని మున్సిపాలిటీ నిబంధనల మేరకు జరిగాయన్నారు. టెండర్లు రద్దుపరిస్తే మరికొద్ది నెలలు పనులు పెండింగ్ పడతాయన్నారు. ఇప్పటికే 15వ ఫైనాన్స్ నిధులు రూ.30 కోట్ల మేర మురిగిపోయి వెనక్కి వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. తాత్కాలిక కూరగాయల మార్కెట్‌కు నిర్వహించిన టెండర్లను వైసీపీ పాలకమండలి ఆమోదించలేదన్నారు. జనవరి 31 జరిగిన కౌన్సిల్ సమావేశం అజెండాపై చైర్‌పర్సన్ లక్ష్మీదేవి హైకోర్టులో కేసు వేసిందన్నారు. కోర్టు తీర్పు మేరకు మార్కెట్ టెండర్‌ను ఆమోదిస్తామన్నారు. టీడీపీ సభ్యులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందని దోమల వ్యాప్తి పెరిగిందని ఇందుకు ప్రధాన కారణం క్లాప్ ఆటోలు బంద్ కావడం అన్నారు. ఇందుకు కమిషనర్ మల్లికార్జున స్పందిస్తూ క్లాప్ ఆటోలు లేకున్నా పుష్‌కాట్‌లతో చెత్త సేకరణ జరుగుతోందన్నారు. అక్రమ కట్టడాలపై కాంగ్రెస్ కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా అధికారుల తీరుపై ఆరోపణలు చేయడంతో కమిషనర్ తీవ్ర ంగా మండిపడ్డారు. సభ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. మొత్తం 53 అంశాల అజెండాలో అనేక అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. ఎలాంటి ఘర్షణ జరుగకుండా ఒన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు రామకృష్ణారెడ్డి, సదాశివయ్య, గోవిందరెడ్డి ఎస్ఐలు సంజీవరెడ్డి , శ్రీనివాసులు, అరుణ్‌రెడ్డి తదితరులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

శ్మశాన వాటికలో స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు 10వ వార్డులోని ఎస్సీ కాలనీలో ఉన్నటువంటి శ్మశానం వాటికలో స్థలాన్ని ఆక్రమించారని బుధవారం తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. బంది సుందర్‌రావు అనే వ్యక్తి అతని కుమారులు బాబు స్థలాన్ని ఆక్రమించారని వినతి పత్రంలో తెలిపారు. వెంటనే ఆక్రమించిన వారిపై విచారణ పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలని వార్డుకు చెందిన ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు కన్నెలూరు గ్రామస్థులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆక్రమణదారుల నుంచి చెరువును కాపాడాలి

పోరుమామిళ్ల ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం చెరువును సర్వే చేయించి అక్రమార్కుల కబంధ హస్తాల నుంచి కాపాడాలని నీటి సంఘం అధ్యక్షుడు చెరుకూరి వీర చెండ్రాయుడు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రంగసముద్రం చెరవుకు సంబంధించి సర్వే నెం.217లో 46 ఎకరాలు, 226లో 135 ఎకరాలు 227లో 41 ఎకరా, 916లో 41 ఎకరాల చెరువు మొత్తం ఆక్రమణలో ఉందన్నారు. ఇంత వరకు అధికారులు చెరువుల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ప్రాంతంలో అక్రమంగా దొంగ పట్టాలు పొందిన వారందరికీ జిల్లాకలెక్టరు రద్దు చేశారన్నారు.

విద్యుత్ రాయితీలు వెంటనే అమలు చేయాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, చేనేతలకు విద్యుత్తు రాయితీలను వెంటనే అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు మేకల ఆంజనేయులు ఏపీ ట్రాన్స్‌కో డీఈ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. జమ్మలమడుగులో ఆయన ఆ మేరకు వినతి పత్రం అందించారు.

నిరుపేద జీవనోపాధికి తోపుడుబండి వితరణ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంతో కుటుంబ పోషణ కష్టంగా మారిన ఎర్రగుంట్లకు చెందిన భాస్కర్ అనే వ్యక్తికి కొత్తపేటకు చెందిన కె.సునీల్‌కుమార్‌రెడ్డి తోపుడుబండి వితరణ చేశారు. బుధవారం వికసిత ఫౌండేషన్ కార్యాలయం వద్ద సునీల్‌కుమార్‌రెడ్డి తన తల్లి పద్మజ చేతుల మీదుగా రూ.16వేలు విలువైన తోపుడుబండిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మిదేవి, శివప్రసాద్, శేఖర్, సుబ్బయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలి

బద్వేలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్‌సిలిండర్‌తో శవయాత్ర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు చిన్ని మాట్లాడుతూ పెట్రోలు, డీజలపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేసి అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్ షరీఫ్, గంపా అనంతమ్మ, పసుపుల మోక్షమ్మ, శాఖా కార్యదర్శులు షేక్ మస్తాన్‌బీ, షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగల అరెస్టు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హోమస్‌పేటలోని ఆయుర్వేద మందుల దుకాణంలో మంగళవారం వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లిన దొంగలను బుధవారం త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమేరకు సీఐ గోవిందరెడ్డి వివరాలను వెల్లడించారు. మంగ్లవారం మద్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో హోమస్ పేటలోని ఆయుర్వేద మందుల దుకాణంలో వున్న సుభాషిణీ (70) అనే వృద్ధురాలు మెడలో బలవంతంగా గొలుసు లాకెళ్లి ఎవ్వరికైనా చెపితే చంపుతామని బెదిరించి వెళ్లిన ఇద్దరు దొంగలను సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. చాపాడు మండలం బద్రిపల్లెకు చెందిన చిలంకూరి బాలయ్య (50) ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందినశ్రీరామ ఏసురత్నమ్మ (44)లను బుధవారం అరెస్టు చేసివారి వద్దనుంచి 29 గ్రాముల బంగారు గొలుసు, డాలరు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కొద్ది గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్న సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ యోగేంద్ర సిబ్బంది దస్తగిరి , సుబ్రమణ్యం, బాల ఏసు, జనార్ధన్ రెడ్డి సుధామ జీలను డీఎస్పీ అభినందించారు. తగు రివార్డుల కొరకు సిఫార్సు చేశామన్నారు.

బీసీ సమరభేరిని జయప్రదం చేయండి

బద్వేలు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే బీసీ సమరభేరిలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌస్‌పీర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద బీసీ రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టబోయే బీసీ సమరభేరి లో అధిక సంఖ్యలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలు విడుదల చేశారు.

లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోండి

- 2026 మార్చికి పథకం ముగుస్తుంది
- హౌసింగ్ పీడీ రాజారత్నం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజారత్నం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని హౌసింగ్ పీడీ రాజారత్నం సూచించారు. బుధవారం ఎర్రగుంట్ల నగర పంచాయతీలోని జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లను పరిశీలించి అనంతరం సచివాలయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎస్సీలకు, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, గిరిజనులకు రూ.1లక్ష అదనపు సాయం ఇచ్చిందన్నారు. కాలనీలో విద్యుత్ సక్రమంగా లేదని, బోర్ తాగేందుకు పనికిరావడం లేదని, తాగునీటి సౌఖర్యం కల్పించాలని లబ్ధిదారులు కోరారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూస్తామన్నారు. 2026 మార్చి నాటికి ఈ స్కీం ముగుస్తుందని అంతలోపు లబ్ధిదారులు పూర్తిచేసుకోవాలన్నారు. అర్బన్ పరిధిలో మొత్తం 720 గృహాలు నిర్మాణంలో ఉండగా 335 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. నూతన ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు సాయం అర్బన్‌లో 176 మందికి, రూరల్‌లో 64మందికి చేరినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఈ రాజశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డికి సమస్యల స్వాగతం



భూపేశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న లింగాపురం గ్రామస్థులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి ప్రజల నుంచి అధిక సంఖ్యలో సమస్యలు స్వాగతం పలికాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి అన్ని ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి ఆయా గ్రామాల్లో సమస్యలకు సంబంధించి వినతి పత్రాలను భూపేశ్‌రెడ్డికి అందజేశారు. మైలవరం మండలం లింగాపురం గ్రామానికి చెందిన ప్రజలు గ్రామంలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గురప్పస్వామి దేవాలయంలో కమిటీ సభ్యత్వం కావాలని దేవాలయం వద్ద లింగాపురం పంచాయతీ అనే పేరు రాయించాలని, ఆలయ ప్రాంగణంలో దుకాణాలకు అనుమతి కల్పించాలని వేలం పాటలలో లింగాపురం గ్రామ ప్రజలను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలకొండయ్య, బాలూనాయక్, నాగరాజునాయక్, ఎం.వెంకటేష్ నాయక్, తిరుపాల్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మైలవరం మండలం చిన్నవెంతుర్ల గ్రామంలో టీడీపీలో ఇటీవల చేరినవారే పీర్లమాన్యం భూమి ఆక్రమించారని సమస్య పరిష్కరించాలని పలువురు కోరారు. కొండాపురం ముంపు గ్రామస్థులు వారి వారి సమస్యలను వివరించారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, పెద్దముడియం, తలమంచిపట్నం, తదితర గ్రామాల నుంచి సుమారు 20 దాకా గ్రీవెన్స్‌లో వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, తలమంచిపట్నం సుమంత్, లక్ష్మణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు జీవితం పలువురికి ఆదర్శం



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత చంద్ర రాజేశ్వరరావు జీవితం పలువురికి ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోనీ సీఆర్‌సీ నగర్‌లో స్వాతంత్ర సమరయోధుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా వీరశేఖర్ మట్లాడుతూ తన వ్యక్తిగత జీవితాన్ని ఫణంగా పెట్టి బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాల కోసం తన సొంత ఆస్తులనునైతం పంచిపెట్టిన గొప్ప నిరాడంబరుడని కొనియాడారు. భూమిలేని నిరు పేదల కోసం పోరాటాలు నిర్వహించి ఆద్యుడు అయ్యారన్నారు. అంతకుముందు చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు బాబు, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్లు. డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణంతోపాటు డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మార్చి 20 నుంచి ఏప్రిల్ 8 వరకు సీపీఎం ప్రజా చైతన్యయాత్ర వార్డుల్లో, వీధుల్లో సమస్యల పరిష్కారం కోసం పర్యటించిందన్నారు. ఈ సందర్భంగా గుంటూరు బాపనయ్య కాలనీలో పదేళ్లుగా చిన్నపాటి రేకులు వేసుకుని నివాసం గడుపుతున్నారని వారికి మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ, కరెంటు సౌకర్యం లేదన్నారు. వెంటనే వారికి పట్టాలు మంజూరు చేసి సిమెంటు రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కోట్ల రూపాయలు మంజూరైనా పంచయతీలు మౌలిక వసతులకు దూరంగా ఉన్నాయన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

పేదోళ్లకు సొంత ఇంటి సౌకర్యం కల్పించండి



ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పేదోళ్లకు సొంత ఇంటి సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎర్రగుంట్లలో టిడ్కో ఇళ్లు, అర్హులైనవారందరికి స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తోరో చెప్పాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, ఎస్.వెంకట్‌రాముడు, జగనన్న కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ముద్దనూరు ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి):గర్భిణులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాల ని వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, షుగర్, రక్త,సిఫిలిష్ పరీక్షలు ,ఎత్తు, బరువు కొలతలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో కాన్పులు శ్రేయస్కరమన్నారు. ఆరోగ్య పరీక్షలకు వచ్చిన వారికి మానవతా సేవ సంస్థ ఆధ్వర్య ఉచిత భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున,ఆరోగ్య విస్తర్ణ అధికారి శ్రీనివాసులరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంప్‌బెల్‌లో కొనసాగుతున్న అత్యవసర సేవలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు క్యాంప్‌బెల్ వైద్యశాలలో బుధవారం ఉదయం నుంచి అత్యవసర సేవలు కొనసాగాయి. మెడికల్ సూపరింటెండెంట్ మార్క్‌తో సిబ్బంది రెండు రోజులపాటు నిరసనలు తెలిపారు. మూడవ రోజు అలాంటివేమి లేవు. అయితే క్యాంప్‌బెల్ వైద్యశాలలో ఎస్ఐ రామకృష్ణతోపాటు పోలీసు సిబ్బంది బందోబస్తు కొనసాగుతోంది. గతంలో లాగా రోగులు పెద్దగా ఆస్పత్రికి రాలేదని అక్కడున్న సిబ్బంది తెలిపారు. ఏది ఏమైనా ఆందోళన సద్దుమణిగింది